# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 29-03-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రైతులకు ఎరువుల రాయితీ కింద 37 వేల 216 కోట్ల రూపాయల విడుదలకు కేంద్రమంత్రివర్గం ఆమోదం తెలిపింది.**
2. **ఆరోగ్య పథకాలకు ఆంధ్రప్రదేశ్‌కు అదనపు నిధులు కేటాయించాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.**
3. **యంగ్ ఇండియా నైపుణ్య విశ్వవిద్యాలయం ఏర్పాటుకు స్థల పరిశీలన చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.**
4. **ఆంధ్రప్రదేశ్లో ఏప్రిల్ నుంచి రబీ ధాన్యం కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.**
5. **దేశంలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలవనుందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు.**

===========================

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కరవుభత్యం - డిఎ, పింఛనుదారులకు డియర్‌నెస్ అలవెన్సు-డిఆర్ ను రెండు శాతం చొప్పున పెంచుతూ కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన నిన్న జరిగిన కేంద్రమంత్రివర్గ సమావేశ వివరాలను కేంద్ర సమాచార ప్రసారశాఖ మంత్రి అశ్వినీ కుమార్ వైష్ణవ్ వెల్లడించారు. ఈ నిర్ణయంతో జవనరి 1 నుంచి చెల్లించాల్సిన డిఎ రేటు 55 శాతానికి పెరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వంలోని సుమారు 48.66 లక్షల మంది ఉద్యోగులకు, 66.55 లక్షల మంది పింఛనుదారులకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. అలాగే రైతులకు ఎరువుల రాయితీ కింద 37 వేల 216 కోట్ల రూపాయలు మంజూరు చేసిందని చెబుతూ...

.. వాయిస్.... 32 సెకన్లు

---------------------------

జాతీయ ఆరోగ్య మిషన్, ఇతర పథకాల కింద రాష్ట్రానికి అదనంగా 259 కోట్ల రూపాయలు కేటాయించాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి సహా పలువురు మంత్రులను ఆయన నిన్న కలిశారు. జాతీయ ఆరోగ్య మిషన్ కింద రాష్ట్రానికి 109 కోట్ల రూపాయలు విడుదల చేయాలని, పనితీరుకు ప్రోత్సాహకం కింద

రాష్ట్రానికి మరో 150 కోట్ల రూపాయలు విడుదల చేయాలని కోరారు.

---------------------------

తెలంగాణాలోని సిద్దిపేట జిల్లా దుబ్బాకలో యంగ్ ఇండియా నైపుణ్య విశ్వవిద్యాలయం ఏర్పాటుకు స్థల పరిశీలన చేయాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో నిన్న దుబ్బాక శాసనసభ్యులు కొత్త ప్రభాకర్‌రెడ్డి ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దుబ్బాకలో నైపుణ్య విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి స్థల పరిశీలన కోసం అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఏప్రిల్ నుంచి రబీ ధాన్యం కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాల సంస్థ 227వ బోర్డు సమావేశం విజయవాడలో మంత్రి అధ్యక్షతన నిన్న జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఖరీఫ్ నాటికి ధాన్యం కొనుగోలు మరింత సమర్ధవంతంగా నిర్వహించడానికి రైతు సేవ కేంద్రాల్లోని సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఖరీఫ్ సీజన్‌లో 5 లక్షల 61 వేల 216 మంది రైతుల నుంచి 35 లక్షల 48 వేల 724 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ఇందుకు సంబంధించి 8 వేల 138 కోట్ల రూపాయల నగదును రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు.

---------------------------

లేపాక్షి ఉద్యోగులకు గతంలో నిలిపేసిన ప్రోత్సాహకాలను పునరుద్ధరిస్తున్నట్లు చేనేత, జౌళిశాఖ మంత్రి ఎస్. సవిత ఒక ప్రకటనలో తెలిపారు. లేపాక్షి విక్రయశాల్లో ఉత్పత్తుల అమ్మకాలను పెంచేలా ఉద్యోగులకు ప్రోత్సాహకాలను ఇస్తుండటం ఆనవాయితీగా వస్తోందని, కరోనా సమయంలో వీటిని నిలుపుదల చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంతోపాటు దేశంలోని పలు నగరాల్లో 97 విక్రయశాలలు ఉన్నాయని, 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరి నెల వరకూ ఉత్పత్తుల అమ్మకాలతో 5.50 కోట్ల రూపాయల మేర లాభాలు ఆర్జించినట్లు మంత్రి తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను త్వరిత గతిన పూర్తి చేయడానికి కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి ఆ శాఖ ఉద్యోగులకు సూచించారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో ఉద్యోగులతో మంత్రి నిన్న మాట్లాడుతూ... ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఇళ్లను వచ్చే ఏడాది మార్చిలోగా పూర్తి చేయాల్సి ఉన్నందున లబ్ధిదారుల్లో అవగాహన కల్పించి నిర్మాణల పూర్తికి కృషి చేయాలని కోరారు.

---------------------------

దేశంలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలవనుందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఏప్రిల్ 1 నుంచి అర్హులందరికీ రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో కొత్తగా మరో 30 లక్షల మందిని రేషన్‌కు అర్హులుగా గుర్తించబోతున్నట్లు చెబుతూ...

..వాయిస్.... 34 సెకన్లు....

కాగా, పేదలకు త్వరలో ఉప్పు, పప్పు, చింతపండు వంట నిత్యావసర సరకుల్ని కూడా రేషన్‌దుకాణాల ద్వారా అందిస్తామని, క్రమక్రమంగా వీటి సంఖ్య పెంచుతామని  మంత్రి వెల్లడించారు.

----------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 120వ సంచిక రేపు ప్రసారం అవుతుంది. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధాని  ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారమౌతుంది.

----------------------------

కేంద్ర సమాచార ప్రసార శాఖ ఆధ్వర్యంలో మే 1 నుంచి 4 వ తేదీ వరకూ ముంబైలో వరల్డ్ ఆడియో, విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ వేవ్స్ జరగనుంది. సినిమా, యానిమేషన్, గేమింగ్ రంగాల్లో ప్రపంచ పెటుటబడులను ఆకర్షించడానికి భారత్ ను ముఖ్య కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ  ప్రతిష్టాత్మక సదస్సును నిర్వహిస్తోంది. వేవ్స్ లో భాగంగా మీడియా వినోద పరిశ్రమల కోసం గ్లోబల్ ఈ మార్కెట్‌ను వేవ్స్ బజార్ కల్పిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కొనుగోలుదారులు, పంపిణీదారుల సహకారంతో భాగస్వామ్యం అవడానికి అవకాశం కల్పిస్తోంది. దీనికి సంబంధించి నటుడు అనిల్ కపూర్ మాట్లాడుతూ...

..వాయిస్.... 30 సెకన్లు

ఆంధ్రప్రదేశ్‌లో పదవ తరగతి విద్యార్థులకు సాంఘిక శాస్త్రం పరీక్ష ఏప్రిల్ 1వ తేదీన జరుగుతుందని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు తెలిపారు. ఈ నెల 31వ తేదిన రంజాన్ సందర్భంగా సెలవు దినంగా ప్రకటించినట్లు నిన్న విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. పరీక్ష తేదీని విద్యార్థులతో పాటు పరీక్ష విధుల్లో ఉన్న వారందరికీ తెలియజేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

----------------------------

ఆంధ్రప్రదేశ్‌లో పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి చర్యలు చేపడుతోందని ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ తెలిపారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో నీతి ఆయోగ్ ప్రతినిధులతో  నిన్న ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ (2024)లో భాగంగా 160 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇంధన వనరుల అభివృద్ధిలో భాగంగా సోలార్, విండ్, గ్రీన్ హైడ్రోజన్ ఇంధన ఉత్పత్తిలో పెద్దయెత్తున పెట్టుబడులు ఆకర్షించి పలు ప్రాజెక్టులు నెలకొల్పేందుకు కృషి చేస్తున్నట్లు నీతి ఆయోగ్ ప్రతినిధి బృందానికి విజయానంద్ వివరించారు.

=====================